క్లుప్తంగా

అద్దె వాహనాలకు డ్రా

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో ఈ నెల 24న వాహనాలకు లక్కీ డ్రా నిర్వహిస్తామని జీఎం వి.కృష్ణయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్క్‌షాప్‌లో త్రీటీ ప్లాట్‌ఫారం ట్రక్, క్వాలిటీ డిపార్ట్‌మెంట్‌లో 2 డబ్ల్యూడీ నాన్ ఏసీ క్యాంపర్ జీప్ ఏరియా ఇంజనీర్ (ఈఅండ్‌ఎం) ఆఫీస్‌లో 70 హెచ్‌సీ అంతకంటే ఎక్కువ కెపాసిటీ డీజిల్ ఏసీ కారు అద్దె వాహనాలు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 24న సాయంత్రం 4 గంటలకు జీఎం కార్యాలయంలో లక్కీ డ్రా నిర్వహించటం జరుగుతుందని తెలిపారు.

సెక్యూరిటీ వ్యవస్థను బలోపేతం చేయండి..


జీఎంతో మాట్లాడుతున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సెక్యూరిటీ వ్యవస్థను బలోపేతం చేయాలని, తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట శివశంకర్ కోరారు. గురువారం ఆర్‌పీఐ అత్తవాలే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పసుల రవికుమార్ బృందంతోపాటు శివశంకర్ జీఎం సెక్యూరిటీ లక్ష్మీనారాయణను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోట మాట్లాడుతూ... సంస్థ ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీల పాత్ర కీలకమని, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు జీఓ నంబర్ 22 ప్రకారం వేతనాలు పెంచే విధంగా చర్యలు చేపట్టాలని, సంస్థ పరిధిలో ఖాళీగా ఉన్న కంపెనీ క్వార్టర్లను ఉచితంగా ప్రైవేట్ గార్డులకు ఇవ్వాలని, ఎండా, వానకు సెక్యూరిటీలు అంకితభావంతో విధులు నిర్వహిస్తూ సంస్థ ఆస్తులు కాపాడుతున్నట్లు చెప్పారు.

వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ వారి ఆధ్వర్యంలో గురువారం కూలీలైన్ ప్రభుత్వ పాఠశాలలో డార్విన్ జీవ పరిణామ సిద్ధాంత ప్రచారోద్యమ కార్యక్రమంలో భాగంగా వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. వక్తలు డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. దీంతోపాటుగా జన విజ్ఞాన వేదిక ఆశయాల గురించి, చేస్తున్న పనుల గురించి వివరించారు.

జేఏసీ నాయకుల అరెస్ట్

పాల్వంచ: ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 20వ తేదీన హైదరాబాద్‌లో విద్యుత్ సౌధ ముట్టడికి వెళ్లకుండా జేఏసీ నేతలను పోలీసులు గురువారం అడ్డుకున్నారు. ఆర్టిజన్లలకు కన్వర్షన్ చేయాలని కొంత కాలంగా దశల వారీ ఆందోళనలకు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా చలో విద్యుత్ సౌధకు జేఏసీ పిలుపునిచ్చింది. దీంతో ముందస్తు సెలవులు పెట్టుకున్న ఆర్టిజన్లకు అధికారులు సెలవులను రద్దు చేయడంతో పాటు, విధుల్లోకి రాకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో పాటు బుధవారం రాత్రి 11గంటలకు జేఏసీ కేటీపీఎస్ చైర్మన్ మరకల నర్సింహారెడ్డి, టి.రాములు, కె.రవికుమార్, ఎం.వీరయ్య, ఎల్.అప్పారావులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం లక్ష్మయ్య, రమేష్, సైదులు, ప్రసాద్, చిట్టిబాబులను అదుపులోకి తీసుకుని స్టేషన్ తరలించి ఆందోళనలకు వెళ్లకుండా నిలిపివేశారు. ఈ సందర్భంగా స్టేషన్ వద్ద నాయకులు మాట్లాడుతూ... ఆర్టిజన్లకు ప్రభుత్వం కన్వర్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పోరాటాల ద్వారానే హక్కుల సాధన


మాట్లాడుతున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపు, సమస్యల పరిష్కారం హక్కులు పోరాటాల ద్వారానే సాధ్యమవుతుందని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు పేర్కొన్నారు. గురువారం కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని బంగ్లోస్‌లో కాంట్రాక్ట్ కార్మికుల నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సింగరేణిలో అనేక సంవత్సరాలుగా చేసిన సమ్మెలు, పోరాటాలు ఐక్య ఉద్యమాల ద్వారా సమస్యలను పరిష్కరించుకున్నట్లు చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం వేతనాలు పెంచకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, సింగరేణి యాజమాన్యం కూడా ఈ విషయంలో పట్టించుకోవటం లేదన్నారు. గత పోరాటాల అనుభవంతో రాబోయే రోజుల్లో జీఓ నంబర్ 22 ప్రకారం వేతనాలు పెంచుకోవటానికి ఈఎస్‌ఐ కార్డుల సాధనకు, పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యల పరిష్కారినికి ఏఐటీయూసీ పోరాటాలకు సిద్ధమవుతుందని, కార్మికులు ఈ పోరాటాలకు తమ మద్దతు తెలపాలని కోరారు.

సమయం ఆసన్నమవుతోంది..

- సమీపిస్తున్న పదో తరగతి వార్షిక పరీక్షలు
- కొనసాగుతున్న ప్రేరణ, శిక్షణ తరగతులు
- పట్టుదలతో శ్రమిస్తే విద్యార్థులకు విజయం


కొత్తగూడెం కూలీలైన్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల సమయం సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు మనోధైర్యం కల్పించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్, విద్యాశాఖాధికారులు ప్రేరణ, శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. కలెక్టర్ పాఠశాలలను సందర్శించి తన బాల్యంలో ఎలా సిద్ధమయ్యేవారో విద్యార్థులకు చెబుతూ వారిలో పట్టుదల పెరిగేలా చూస్తున్నారు. విద్యార్థి జీవితంలో పదో తరగతి పరీక్షలకు ప్రత్యేకత ఉంది. చదువు ప్రయాణంలో ఇదే మొదటి మైలురాయి కావడంతో శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరముంది. జీవితంలో మొదటిసారి పబ్లిక్ పరీక్షలను రాయబోతున్న విద్యార్థులకు నిపుణులు సూచనలు, సలహాలు చేస్తున్నారు. వీటిని అనుసరిస్తే ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

పరీక్ష రోజున ఇలా...

- పరీక్ష రోజు మితంగా చక్కని పోషక విలువలు ఉండే ఆహారాన్ని స్వీకరించండి.
- పరీక్ష పత్రం ఇవ్వగానే నిదానంగా, ప్రశాంతంగా, ఆసాంతం చదవండి.
- పరీక్ష పత్రంలో ఏ ఏ ప్రశ్నలకు పర్ఫెక్ట్ గా జవాబులను రాయగలరో ముందే గుర్తించండి.
- పశ్నలను, సెక్షన్లను, వాటి మార్పులను గమనిస్తూ సమయ విభజన చేసుకోండి. అనంతరం రాయడం ప్రారంభించాలి.
- చక్కగా జవాబులు రాయగలం అనుకునే ప్రశ్నలను మొదటగా జవాబులను రాయండి.
- ఫస్ట్ ఇంప్రెషన్ ఇస్ ద బెస్ట్ ఇంప్రెషన్ కాబట్టి చక్కని దస్తూరి రాతతో సమయపాలనతో జవాబులను వ్రాయండి.
- ప్రశ్నలకు స్పష్టంగా, సూటిగా జవాబులను రాయండి.
- ఒత్తిడి ఎదురైతే ఊపిరి పీల్చుకుని వదలండి, నీరును తాగితే కొంత ఉపశమనం ఉంటుంది.
- ఈసారి మీకు 12/24 పేజీల జవాబు బుక్ లెట్‌ను ఇవ్వబడుతుంది. దానిలోనే చక్కని రాతతో నిర్మలంగా రాయండి.
- అన్ని ప్రశ్నలకు జవాబులను రాయండి. క్రమంగా సెక్షన్లు వారీగా రాయండి. చివరగా రాసిన జవాబులను వాటి ప్రశ్నల సంఖ్యను ఒకసారి చెక్ చేసుకోండి.
- బుక్లెట్‌కు అనుసంధానంగా బిట్ పేపరు, గ్రాఫ్, మ్యాప్‌లను దానికి జత చేసి, సరి చూడండి.
- ఎవరో సహాయం చేస్తారు, ఏదో ఒకటి రాయవచ్చులే అనుకోకుండా సొంత జ్ఞానాన్నే నమ్ముకోవాలి.

విద్యార్థులకు సూచనలు

- ప్లానింగ్‌లో సిలబస్ ఏంటి, ఏ పుస్తకాలు రిఫర్ చేయాలి, లిటరేచర్ ఏంటి? రీడింగ్ మెటీరియల్ విషయాల్లో స్పష్టత కలిగి ఉండడమే ప్లానింగ్. రెండో దశ ప్రిపరేషన్‌పై దృష్టి సారించాలి. పరీక్షలకు ప్రిపేర్ అయ్యే సమయంలో వేటి పైనా దృష్టి సారించకుండా కేవలం చదివే అంశాలు, విషయాలపైనే దృష్టి సారిస్తూ ప్రిపేర్ అయ్యే సమయంలో ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రావాలి.
- చక్కని ప్రశాంత వాతావరణంలోనే చదవండి.
- రాయబోవు పరీక్ష గురించి పూర్తి సమాచారాన్ని తెలిసి ఉండండి.
- పరీక్ష పత్ర నమూనాపై పూర్తి అవగాహన కలిగి ఉండండి.
- చదివే క్రమంలో కంటెంట్ మేర సమయ విభజన చేస్తూ చదవండి.
- ఒకేసారి గంటలకొద్దీ చదవకుండా బ్రేక్ ఇవ్వండి.
- చదివే సమయంలో ఏవేని సందేహాలు వస్తే వెంటనే నివృత్తి చేసుకోండి.
- సిలబస్ పై, పూర్వ ప్రశ్నాపత్రాలపై పూర్తి అవగాహన కలిగి ఉండండి.

ఇదే మొదటి మైలురాయి



సింగరేణి(కొత్తగూడెం): చదువు ప్రయాణంలో మొదటి మైలురాయి పదో తరగతి. శ్రద్ధతో చదివితే విజయం వరిస్తుంది. భయం, సందేహాలు లేకుండా చదివి పరీక్షలు రాయాలి. ప్రణాళిక ప్రకారం అన్ని సబ్జెక్టుల్లో రోజుకో పాఠం చదివితే మంచి ఫలితాలు వస్తాయి.

– డాక్టర్ ప్రభుదయాళ్, ఎంఈఓ, రామవరం హైస్కూల్ హెచ్‌ఎం

మహిళల ఆర్థికాభివృద్ధే సెర్ప్ లక్ష్యం


అవగాహన కల్పిస్తున్న దుర్గారావు

ఇల్లెందురూరల్: పొదుపు సంఘాల మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సెర్ప్ ఆధ్వర్యంలో వివిధ రూపాలలో రుణాలు మంజూరు చేస్తున్నామని సెర్ప్ ఏపీఎం దుర్గారావు అన్నారు. మండలంలోని మర్రిగూడెం గ్రామంలో స్వయం సహాయక సంఘాలలో పుస్తక నిర్వాహకులకు గురువారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక భద్రత పథకాల ద్వారా మెరుగైన జీవన విధానం కోసం ఉన్నతంగా భవిష్యత్ ప్రణాళికలను రూపొందించుకోవాలని సూచించారు. దీనికోసం సెర్ప్ ద్వారా అమలవుతున్న బ్యాంకు రుణాలు, సామాజిక భద్రత పథకాలు, ఇన్సూరెన్స్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్వయం ఉపాధి లక్ష్యంగా యూనిట్లు నెలకొల్పుకుని ఆర్థిక స్థిరత్వం సాధించాలన్నారు. ఉత్సాహవంతులైన మహిళలందరికీ మహిళా శక్తి ద్వారా పెద్దమొత్తంలో రుణాలు మంజూరు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో ఫైనాన్షియల్ లిట్రసీ కౌన్సిలర్లు పుష్ప, రామ్మూర్తి, యుగంధర్, యూనీస్, కృష్ణకుమారి, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ అమలుకు కృషి చేయండి..


ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

టేకులపల్లి: ఎస్సీ కులాలకు రానున్న స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ అమలుకు తన వంతు కృషి చేయాలని, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తమ సమస్యలు తీసుకెళ్లాలని షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు గురువారం కోయగూడెంలో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాలకు రాజ్యాంగం ప్రసాదించిన రిజర్వేషన్ ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాలకు స్థానిక రిజర్వేషన్లను జనరల్‌లో కలిపి అంధకారంలో నెట్టివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కండే రాములు, ఎనగంటి అర్జున్‌రావు, ఆర్.నరసయ్య, మీసాల రాములు, సరికొండ స్వామి, సలిగంటి కొమరయ్య, వెంకటేశ్వర్లు, ఎనగంటి శ్రీను పాల్గొన్నారు.

లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలి


కొమరారం సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న మాస్‌లైన్ కార్యకర్తలు

ఇల్లెందురూరల్: కరెంటు కోతలు, లోవోల్టేజీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని కొమరారం, పోలారం విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద గురువారం మాస్‌లైన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. నాయకులు బుర్ర వెంకన్న, ఆజ్మీర బిచ్చా, శ్రీరాంకోటయ్య, జూకంటి గాంధీ మాట్లాడారు. వ్యవసాయానికి నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ నేతలు నేడు తరచు కోతలు, లోవోల్టేజీ విద్యుత్‌ను సరఫరా చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. భూగర్భ జలాలు అడుగంటడంతో వ్యవసాయ మోటార్లకు సమస్యగా ఉందని, కరెంటు ఎప్పుడు వస్తుందో, పోతుందో తెలియక రైతు నిరంతరం మోటార్ల వద్ద కాపలా ఉండాల్సి వస్తోందని వాపోయారు. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బుర్ర రాఘవులు, వజ్జ వీరభద్రం, వాంకుడోత్ శంకర్, బుర్ర లక్ష్మయ్య, ఇస్లావత్ కోటేష్, ధరావత్ దేవా, ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు అధ్యక్షుడిగా రమణమూర్తి


రమణమూర్తికి నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

కొత్తగూడెంటౌన్: చర్ల మండలానికి చెందిన తోటమల్ల రమణమూర్తిని మాల మహానాడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడిగా రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆదేశాల మేరకు ఎన్నుకున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ జాతీయ కార్యదర్శి అశోద భాస్కర్ తెలిపారు. గురువారం కొత్తగూడెం పట్టణంలోని మాల మహానాడు జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రమణమూర్తి నియామకంతో మాల మహానాడు జిల్లాలో మరింతగా బలోపేతం అవుతుందన్నారు.

ఈ సందర్భంగా రమణమూర్తిని నియామకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు ఎడెల్లి గణపతి, జిల్లా ఉపాధ్యక్షులు పల్లంటి రమేష్, జెట్టి మోహన్, కాలే పుల్లయ్య, బోడ దివ్య, దార చిరంజీవి, కారంపూడి సాల్మన్ రాజ్, తోటమల్ల గోపాలరావు, బోళ్ల వినోద్ తదితరులు పాల్గొన్నారు.

వలస కూలీలకు ఉపాధి కల్పించాలి


కూలీలకు నగదు అందజేస్తున్న ఫహీందాదా

సూపర్‌బజార్(కొత్తగూడెం): రామవరం పరిరక్షణ కమిటీ చేపట్టిన నేను సైతం కార్యక్రమంలో భాగంగా గరిమెళ్లపాడు గిరిజనులకు ఈద్గా ఖబ్రస్తాన్ కమిటీ సహకారంతో గురువారం ఏడు కుటుంబాలకు ఉపాధి కల్పించారు.

ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు ఫహీం దాదా, రామవరం పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు ముస్తాఫా మాట్లాడుతూ... గరిమెళ్లపాడు గిరిజనులు ఉపాధి లేక వలస కూలీలుగా మారడం ఎంతో బాధాకరమన్నారు. వారికి ఉపాధి అవకాశాల కల్పించి ఆదుకోవాలని అధికారులను, ప్రజాప్రతినిధులను కోరారు. సుమారు 72 ఎకరాల స్థలం నిరుపయోగంగా ఉందని, గతంలో ఉభయ తెలుగు రాష్ట్రాలకు లక్షల్లో మొక్కల సరఫరా జరిగేదని, వంద కుటుంబాలకు ప్రత్యక్షంగా మరికొన్ని కుటుంబాలకు పరోక్షంగా ఉపాధి దొరికేదన్నారు. ఈ కార్యక్రమంలో షమీ, రసూల్, ఖయ్యూం, మహ్మద్ గౌస్, మెయినుద్దీన్, వెంకటేశ్వర్లు, రాధ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటాలి


టాలెంట్ టెస్ట్ రాస్తున్న విద్యార్థులు

జూలూరుపాడు: విద్యార్థులు పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటాలని హైదరాబాద్ ఏసీపీ సబ్బతి విష్ణుమూర్తి అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన మండల స్థాయి టాలెంట్ టెస్ట్ కార్యక్రమానికి ఏసీపీ విష్ణుమూర్తి ముఖ్యఅతిథిగా హాజరై ప్రశ్నపత్రాలను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ప్రతిభ, సృజనాత్మకత వెలికితీసేందుకు ప్రతిభా పరీక్షలు ఉపయోగపడతాయన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేసే ఏఐఎస్‌ఎఫ్ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు టాలెంట్ టెస్ట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. గుండెపిన్ని వెంకటేశ్వర్లు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ఎస్కే చాంద్‌పాషా, పసుపులేటి పవన్, హైస్కూల్ హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, ఉపాధ్యాయుడు రాంశెట్టి శ్రీనివాసరావు, ఎక్సలెంట్ స్కూల్ కరస్పాండెంట్ కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

దేశమంటే అంబానీ, అదానీలేనా?


మాట్లాడుతున్న డాక్టర్ పాపారావు

సింగరేణి(కొత్తగూడెం): బీజేపీ నేతల దృష్టిలో దేశమంటే అంబానీ, అదానీలే తప్ప, సామాన్య ప్రజలు కాదని, కేంద్ర ప్రభుత్వం తరుపున ఎనిమిదోసారి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు ఊతమిచ్చేదిగా ఉందని, కష్టజీవులకు ఏమాత్రం ఉపయోగపడేలా లేదని ఆర్థిక విశ్లేషకులు డాక్టర్ డి.పాపారావు అన్నారు. గురువారం కొత్తగూడెంలో సీఐటీయూ వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, జిల్లా కమిటీల ఆధ్వర్యంలో మంచికంటి భవన్‌లో జరిగిన జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెడుతూ దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్ అన్న గురుజాడ సూక్తిని ఉటంకిస్తూ మాట్లాడరని, కానీ సమాజ సంపదలో సృష్టికర్తలుగా ఉన్న కార్మికులు, వ్యవసాయ కూలీలు, రైతాంగానికి ఊరట ఇచ్చే విధంగా కానీ, కొత్త పథకాలు ప్రకటన కానీ, వారి కొనుగోలు శక్తి పెంచే నిర్ణయాలు కానీ ఈ బడ్జెట్‌లో లేవన్నారు. పైగా అనేక రూపాలలో పరోక్ష పన్నులను భారీగా విధించినట్లు చెప్పారు.

భారతదేశంలో నూతన ఆర్థిక విధానాల అమలు ప్రారంభమైన 1991 నుంచి వచ్చిన వరస బడ్జెట్‌లను పరిశీలిస్తే, కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ సామాన్యులపైన, మధ్య తరగతిపైన భారం మోపే బడ్జెట్‌ను తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, వ్యవసాయ, కార్మిక సంఘం, రైతుసంఘం నాయకులు పాల్గొన్నారు.

రక్షణ సూత్రాలు పాటించండి..


మాట్లాడుతున్న డైరెక్టర్ సత్యనారాయణరావు

సింగరేణి(కొత్తగూడెం): సంస్థలో పనిచేసే ఉద్యోగులందరూ రక్షణ సూత్రాలు పాటిస్తూ ప్రమాద రహిత సింగరేణిగా మార్చుదామని సింగరేణి డైరెక్టర్ ఈ అండ్ ఎం సత్యనారాయణరావు పిలుపునిచ్చారు. గురువారం కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలోని ఇల్లెందు గెస్ట్ హౌజ్‌లో మూడు రీజియన్లలోని అధికారులకు, ఇంజనీర్లకు, వర్క్‌మెన్‌లకు సేఫ్టీపై ఒక్కరోజు డీజీఎంఎస్ సౌత్ జోన్ హైదరాబాద్, సింగరేణి అంతర్గత భద్రత విభాగం ఆధ్వర్యంలో వర్క్‌షాపు నిర్వహించారు. డైరెక్టర్ మాట్లాడుతూ.. పని ప్రదేశాలలో అందరూ భద్రత సూత్రాలను పాటించాలన్నారు. ఈ వర్క్‌షాపులో నేర్చుకున్న అంశాలను పని ప్రదేశాలలో అందరూ పాటించేలా చర్యలు తీసుకోవాలని, ఇందులో ఉద్యోగులందరినీ భాగస్వాములను చేయాలని చెప్పారు. డీజీఎంఎస్ మెకానిక్ ఆర్ మురుగన్, డీజీఎంఎస్ (మైనింగ్)కమలేష్ వర్మ, డీజీఎంఎస్ (ఎలక్ట్రికల్) నాగుల్ మీరా, రామగుండం రీజియన్‌కు డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్‌వీ సూర్యనారాయణ, బెల్లంపెల్లి రీజియన్ డైరెక్టర్ (పీపీ) వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

అసత్య ఆరోపణలు గర్హనీయం

సింగరేణి(కొత్తగూడెం): ఐఎన్‌టీయూసీ నాయకుడు జనక్‌ప్రసాద్ అవగాహన రాహిత్యంతో అసత్య ఆరోపణలు చేయటం సరికాదని, ఆయన చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని, బీఎంఎస్ జాతీయ నాయకుడు లక్ష్మారెడ్డికి క్షమాపణ చెప్పాలని ఏబీకేఎంఎస్ జాతీయ నాయకుడు పి.మాధవ నాయక్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సీఎంపీఎఫ్ నిధులలో రూ.727 కోట్లను దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెండ్ (డీహెచ్‌ఎల్‌ఎఫ్) కుంభకోణంపై సీబీఐతో విచారణ జరిపించాలని మాత్రమే తాము కోరుతున్నామని, మొత్తం రూ.1390 కోట్లను డీహెచ్‌ఎల్‌ఎఫ్‌లో పెట్టుబడి పెట్టగా, ఆ సంస్థ దివాలా తీయడంతో రూ.727 కోట్లు సీఎంపీఎఫ్ ఖాతాకు తిరిగి రాలేదని తెలిపారు. దీనిపై అవగాహన రాహిత్యంతో మాట్లాడటం ఆయనకు తగదని పేర్కొన్నారు. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని పేర్కొన్నారు.

ఘనంగా సింగరేణి స్కూల్ వార్షికోత్సవం


బహుమతులు అందజేస్తున్న జీఎం కృష్ణయ్య


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఇల్లెందు: ఇల్లెందు జేకే సింగరేణి హైస్కూల్ 49వ వార్షికోత్సవ వేడుకలు ఉత్సాహంగా సాగాయి. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన వేడుకలను ఏరియా జీఎం వి.కృష్ణయ్య, సేవా అధ్యక్షురాలు రమ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. జీఎం మాట్లాడుతూ... సింగరేణి స్కూల్‌లో ఉన్న సదుపాయాలు ఏ ఇతర పాఠశాలలో లేవన్నారు. నామమాత్రపు ఫీజుతో సింగరేణి స్కూల్‌లో విద్యను కొనసాగించవచ్చన్నారు. ఇల్లెందులోని సింగరేణి స్కూల్ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో తన ప్రతిభను చాటిందని చెప్పారు. భారత్ గైడ్స్ అండ్ స్కౌట్స్, ఎన్‌సీసీ, క్రీడల్లో వైజ్ఞానిక ప్రదర్శనలో ఇతర పాఠశాలల కంటే సింగరేణి స్కూల్ ముందంజలో ఉందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సదుపాయాలు కల్పించేందుకు యాజమాన్యం సిద్ధంగా ఉందన్నారు. క్రమశిక్షణలో నైతిక విలువలు పెంపొందించుకోవాలని, విజయాలతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. వివిధ పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. డీజీఎం (పర్సనల్) జీవీ మోహన్‌రావు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ పాఠశాల కరస్పాండెంట్ సుధాకర్, ఎడ్యుకేషన్ సొసైటీ జాయింట్ సెక్రెటరీ, డీవైసీఎంఓ సునిల్, ఎంఈఓ స్వామి, హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫుడ్ ఫెస్టివల్

ఆహా.. ఏమి రుచి

- 40 రకాల వంటకాలను ప్రదర్శించిన విద్యార్థినులు
- విక్రయం ద్వారా ఒక్కో విద్యార్థినికి రూ.500 ఆదాయం


వంటకాల రుచి చూస్తున్న అధ్యాపకులు

పాల్వంచరూరల్: నిత్యం తరగతిలో పెన్నులు, పుస్తకాలతో కుస్తీలు పట్టే విద్యార్థినులు గరిటను తిప్పి వంటకాలు తయారు చేశారు. ఆ వివిధ రకాల వంటలు వండి ఒక్కోటి రూ.10 – 20 వరకు విక్రయించారు. మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ (అటానమస్) డిగ్రీ కళాశాలలో గురువారం మహిళా సాధికారత భాగ్య, ఎస్‌ఎస్‌ఎస్, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో కళాశాలకు చెందిన డిగ్రీ విద్యార్థినులు టేస్టీ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. విద్యార్థినులే స్వయంగా వివిధ రకాల వంటలను తయారు చేసి స్టాల్స్‌లో ప్రదర్శించారు. తెలంగాణ రుచులు అందరినీ ఆకట్టుకున్నాయి.

నూతన వంటకాలు...

పులిహోర, రాగి జావ, రవ్వ లడ్డు, సున్నుండలు, జొన్నరొట్టెలు, సేమియా, డబుల్ కా మీటా, ఫ్రూట్ సలాడ్, క్యారెట్ హల్వా, బిర్యానీ, గుడాలు, మజ్జిగ చారు, నిమ్మరసం రసం వంటి తదితర 40 రకాల వంటలను తయారు చేసి ప్రదర్శించగా వాటిని కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సందర్శనకు హాజరైన స్థానికులు రూ.10- 20 చొప్పున కొనుగోలు చేశారు. ఇలా ఒక్కో విద్యార్థిని రూ.200 – 500వరకు డబ్బులు సంపాదించారు. మొత్తం సుమారు 20వేల ఆదాయం వచ్చినట్లు విద్యార్థినులు తెలిపారు. నగదు రహిత లావాదేవిల కోసం కామర్స్ విభాగం అధ్యాపకులు క్యూఆర్‌కోడ్ ద్వారా లావాదేవీలు నిర్వహించారు.

సంప్రదాయ వంటకాలతో ఆరోగ్యం

తెలంగాణ సంప్రదాయ వంటకాలే ఆరోగ్యమని ఫుడ్‌ఫెస్టివల్‌ను ప్రారంభించిన కళాశాల ప్రిన్సిపాల్ పద్మ అన్నారు. విద్యార్థినులు చదువుతోపాటు వారిలోని సృజనాత్మకతను వెలికి తీయడానికి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా బయటకు వస్తుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ మాధవి, డాక్టర్ ఎస్.శ్రీదేవి, పి.శ్రీనివాస్, డాక్టర్ కొండల్‌రావు, అరుణకుమారి, రమేష్, విజయప్రసాద్, స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.